క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు




కొరముట్ల శ్రీనివాసులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్/రైల్వేకోడూరు అర్బన్ : దీపావళి పండుగ దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. నరకాసురుని ఆగడాలను భరించలేక దేవతలు శ్రీకృష్ణ సత్యభామలను ఆశ్రయించగా, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడు ఆశ్వయుజ చతుర్ధి నాడు యుద్ధంలో నరకాసురుని వధించి లోకానికి వెలుగులు నింపారన్నారు. నరకాసురుని అంతమొందించిన చతుర్దశిని నరక చతుర్దశిగా సంతోషంగా ప్రజలు జరుపుకుంటున్నారని తెలిపారు. జ్ఞానానికి, ఆనందానికి, వికాసానికి, విజయానికి ప్రతిరూపం దీపావళి అని తెలిపారు. జగత్తును జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళిగా దీపావళి నిలుస్తోందని వివరించారు. ఎన్నో విజయోత్సవ చరిత్రలను కలిగిన దివ్య చరితావళి ఇది అని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు వారు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

వివాహ వేడుకలో ఆకేపాటి



ఒంటిమిట్ట : ఒంటిమిట్టకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ మైనారిటీ నాయకుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ కుమార్తె సయ్యద్ యాస్మిన్, వరుడు షేక్ జావిద్‌ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ఆశీర్వదించారు. కడప నగరం నందు సీఎస్ కల్యాణ వేదికలో జరిగిన ఈ వివాహానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఆక్రమణలను తొలగించాలి



ఫుట్‌పాత్‌ను ఆక్రమించడంతో రోడ్డుపై పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో ప్రజలు కాలినడకన వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకున్నారని వాటిని తొలిగించాలని రాయచోటి లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి అధికారులను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాయచోటిలో పాదచారులు నడిచి వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాల్వల పై ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారన్నారు. అయితే దానిని కొందరు ఆక్రమించి బండ్లు (షాపులు) ఏర్పాటు చేసుకోవడంతో వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారన్నారు. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు చొరవ చూపి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలిగించాలని కోరారు.

రేపు కోటి సంతకాల సేకరణ

ఒంటిమిట్ట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తున్న వైఖరిపై వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా రేపు వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని షాదీఖానాలో వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి రేపు(సోమవారం) సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆదివారం వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఒంటిమిట్ట షాదీఖానాకు విచ్చేసి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యునికి సత్కారం



వైద్యాధికారి జొన్నగడ్డల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సామాజిక కార్యకర్తలు

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జొన్నగడ్డల రాజశేఖర్ మూడు సంవత్సరాలలో రెండు వందల కాన్పులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్‌ను ఆదివారం సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు డెక్కలి సుబ్రమణ్యం, షామీర్, హుస్సేన్ తదితరులు ఘనంగా సన్మానించారు. మంగంపేట, పెద్దఓరంపాడు పరిసర ప్రాంత గ్రామాల గర్భిణులకు దాదాపు రెండు వందల కాన్పులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. మంగంపేట దళితవాడ గ్రామానికి చెందిన ఎస్.దేవి అనే మహిళా కాన్పులో ఇద్దరు మగ పిల్లలకు జన్మనివ్వడం జరిగింది. కోవిడ్ సమయంలో రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించారు. అనేక మంది రోగులకు శరీరంలో ఉన్న గడ్డలను తొలగించి శస్త్ర చికిత్సలను విజయవంతం చేశారు.

మార్కెట్‌కు దీపావళి జోష్

- వర్షం రాకపోవడంతో జోరందుకున్న వ్యాపారం
- ఇంటికి టపాసులు తీసుకెళ్లిన ప్రజలు
- వ్యాపారులు నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు




రాజంపేట టౌన్: పట్టణంలోని విక్రయ కేంద్రాల నుంచి పండుగకు టపాసులు తీసుకెళుతున్న ప్రజలు

రాజంపేట టౌన్ : చిన్నారులకు అత్యంత సంతోషాన్ని ఇచ్చే పండుగ దీపావళి. ఆనందకాంతులనిచ్చే దీపావళి రానే వచ్చింది. దీంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఆదివారం నుంచే ప్రజల్లో దీపావళి జోష్ నెలకొంది. టపాసులు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తల్లిదండ్రులకు తెలిసినప్పటికీ తమ పిల్లల ఆనందం కోసం కొన్ని టపాసులైనా వారితో కాల్పిస్తారు. అలాగే యువత కూడా టపాసులు కాల్చేందుకు ఇష్టపడతారు. అందువల్ల ఆదివారం మార్కెట్‌కు దీపావళి జోష్ కనిపించింది. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలకు ప్రజలు పెద్దఎత్తున చేరుకొని టపాసులను కొనుగోలు చేశారు. అందువల్ల పట్టణంలో ఎటుచూసినా అనేక మంది ప్రజల చేతుల్లో, బైక్లపై టపాసులు కనిపించాయి.

కరుణించిన వరుణుడు

గత రెండు రోజులుగా రాజంపేట పట్టణంలో ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. అందువల్ల టపాసుల విక్రయ దుకాణాల ప్రాంగణం బురదమయమైంది. దీంతో వర్షం కురిస్తే వ్యాపారం దెబ్బతింటుందని వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతూ వచ్చారు. అయితే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవకపోవగా కొద్దిపాటి ఎండ కూడా ఉండటంతో బాణాసంచా విక్రయాల వ్యాపారం జోరుగా సాగింది. దీంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. దీపావళి రోజైన సోమవారం కూడా వరుణ దేవుడు కరుణిస్తే టపాసుల పెట్టుబడికి కోసం తీసుకొచ్చిన అప్పులు తీరి అంతో ఇంతో లాభం ఉంటుందని పలువురు వ్యాపారులు అంటున్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

రాజంపేట పట్టణంలోని బైపాస్‌రోడ్డులో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులిచ్చారు. దీంతో వ్యాపారులు 31 దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణాల వద్ద భద్రతా ఏర్పాట్లను అర్బన్ సీఐ నాగార్జున ఆదివారం పరిశీలించారు. వ్యాపారులు రాత్రివేళ చాలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చిన్నపొరపాటు జరిగినా పెద్ద ప్రమాదం సంభవిస్తుందని అందువల్ల దుకాణాలను ఎత్తివేసే వరకు రాత్రి వేళ ఎవరో ఒకరు దుకాణంలో ఉండాలని తెలిపారు. వ్యాపారులు ఆహ్లాదకరమైన వాతావరణం వ్యాపారం జరుపుకోవాలని తెలిపారు.

టపాసుల విక్రయ దుకాణాల తనిఖీ

గాలివీడు : క్రాకర్స్ దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మండల ఎస్ఐ రామకృష్ణ దుకాణదారులకు సూచించారు. ఆదివారం బస్టాండ్ వద్ద పశువుల సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రాకర్ షాపులు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో దుకాణాలను తనిఖీ చేసి, ప్రతి షాపులో అగ్నిమాపక పరికరాలు, డ్రమ్ముల్లో నీరు, ఇసుక వంటి అత్యవసర భద్రతా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. షాపుల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వచేయడం, విక్రయించడం నేరమన్నారు. భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుండుపల్లెలో..

సుండుపల్లి : మండల పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా ప్రజల భద్రత కోసం జిల్లా ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు క్రాకర్ షాపులు, గోడౌన్లలో భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఆదివారం క్రాకర్స్ దుకాణాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, సరైన పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పండుగ రద్దీ వల్ల ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, భద్రతా నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు బాణసంచాలు కాల్చేటప్పుడు పెద్దలు పర్యవేక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సుండుపల్లి: లైసెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు



రాజంపేట టౌన్: దుకాణాల వద్ద భద్రతను పరిశీలిస్తున్న సీఐ నాగార్జున



గాలివీడు: టపాసుల దుకాణదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




వర్షితా రాజ్

పుల్లంపేట : రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు ఆ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీల కంఠరావు తెలిపారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోలర్ స్కేటింగ్‌లో పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని వర్షితా రాజ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. నవంబర్ నెలలో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థిని ఎంపికపట్ల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

డీఆర్సీ సమావేశాలకు ఆహ్వానించాలి

రాయచోటి అర్బన్ : ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే డీఆర్సీ సమావేశాలకు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులను ఆహ్వానించాలని పీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్ సారథ్యంలో జరిగే డీఆర్సీ సమావేశాల్లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష ఉండనుండటంతో ఎన్నికైన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్, అధికారులు ఈ సమావేశాలలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వీరితో పాటు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులను కూడా సమావేశాలకు ఆహ్వానిస్తే అన్ని విషయాలు సమీక్షించవచ్చునని కోరారు. కలెక్టర్ చొరవ తీసుకుని డీఆర్సీ సమావేశాలకు గుర్తింపు పొందిన పార్టీల నుంచి ప్రతినిధులను ఆహ్వానించి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సైదా కోరారు.

చెయ్యేరులో పెరుగుతున్న నీటి ప్రవాహం



రాజంపేట - రాయచోటి మార్గంలోని బాలరాజుపల్లె వంతెన వద్ద నీటి ప్రవాహం

రాజంపేట : నందలూరు చెయ్యేరులో నీటి ప్రవాహం పెరుగుతోంది. పింఛా డ్యాం రెండు గేట్లు ఎత్తి ఆదివారం ఉదయం దిగువకు 10,853 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు ఇంజనీరు నాయక్ పేర్కొన్నారు. రాత్రికి ఇన్‌ఫ్లో తగ్గినట్లుగా వివరించారు. కాగా పెనగలూరు, మన్నూరు పోలీసులు, నందలూరు పోలీసులు చెయ్యేరులో నీటి ప్రవాహం వద్ద గస్తీని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రధానంగా మన్నూరు పీఎస్ పరిధిలోని గుండ్లూరు వద్ద సెలవులు వస్తే చాలు అటు రాజంపేట ఇటు నందలూరు నుంచి జనం చెయ్యేరులో ఈత కొట్టడానికి వస్తూ ఉంటారు. ప్రస్తుతం నీటి ప్రవాహం పెరగడంతో యువకులు, చిన్నారులు ఈత ఆడకుండా అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల అప్రమత్తం

చెయ్యేరు నదీ పరీవాహక ప్రాంతాలైన రాజంపేట మండలంలోని పులపత్తూరు,మందపల్లె, శేషమాంబపురం, గుండ్లూరు, నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని ఇసుకపల్లె, గొల్లపల్లె, నందలూరు, ఆడపూరు, లేబాక, టంగుటూరు, పొత్తపి, పెనగలూరు మండలంలోని సిద్దవరంతోపాటు నదీ పరీవాహక ప్రాంతాలు ప్రజలు చెయ్యేరులో దిగరాదని అధికారులు ముందస్తుగా హెచ్చరిస్తున్నారు.

దారులన్నీ సొంతూళ్ల వైపే

రాజంపేట టౌన్ : వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో అనేక మంది దీపావళిని సొంతూళ్లలో జరుపుకునేందుకు పయనమయ్యారు. ఎటూ ఆదివారం సెలవు కావడం సోమవారం దీపావళి అయినందున రెండు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో అనేక మంది తమ సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లారు. అందువల్ల ఆదివారం వివిధ మార్గాలకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిసి కనిపించాయి. ముఖ్యంగా రాజంపేట పరిసర ప్రాంతాలకు (గ్రామాలకు) ప్రజలు వెళ్లడం కనిపించింది. అలాగే రాజంపేటకు చెంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు రాజంపేటకు చేరుకున్నారు. దీంతో అనేక మంది ఇళ్లు బంధువుల రాకతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే హిందువులు దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఉత్సాహంగా ఉన్న తరుణంలో బంధువుల రాకతో వారి ఉత్సాహం రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం అమ్మా, నాన్నలను, పిల్లలను, బంధువులను, ఆత్మీయులను సెల్‌ఫోన్‌లోని వీడియో కాల్స్ ద్వారా చూసి పలకరింపులతో సరిపెడుతున్న ఇలాంటి తరుణంలో దీపావళిని సొంత ఊరిలో బంధువులతో జరుపుకునేందుకు ప్రజలకు వారివారి ప్రాంతాలకు వెళ్లడం ప్రత్యేకమనే చెప్పుకోవాలి.



పాత బస్టాండులో ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

సేవా కార్యక్రమాల్లో క్షత్రియులు ముందుండాలి




సభలో పాల్గొన్న రాయలసీమ క్షత్రియ వికాస సమితి కార్యవర్గ సభ్యులు

రాజంపేట : సేవా కార్యక్రమాల్లో క్షత్రియ సామాజికవర్గం ముందుడాలని రాయలసీమ క్షత్రియ వికాస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటపతిరాజు అన్నారు. రాజంపేట తాళ్లపాక రోడ్‌లోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం రాయలసీమ క్షత్రియ వికాస్ సమితి ఆధ్వర్యంలో బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల కార్యక్రమాల నిర్వహణకు క్షత్రియులు ముందుండి సహాయ సహకారాలను అందజేయాలన్నారు. సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి సుబ్బరాజు, వైస్ ప్రెసిడెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజులు మాట్లాడుతూ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మెడికల్ క్యాంప్స్, వృద్ధులకు పెన్షన్, ఆటలపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ యుఎస్ఏ, చైర్మన్ భూపతిరాజు పండేటి రాష్ట్రంలో 44 గ్రామాలను దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. దాతల సహకారంతో మరిన్నీ నిధుల సేకరించి, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. సభలో రాయలసీమ క్షత్రియవికాస్ సేవాసమితి అధ్యక్షులు చేజర్ల సుబ్రమణ్యంరాజు, కార్యదర్శి కోనేటి రవిరాజు, కోశాధికారి కొండూరు సుబ్బరామరాజు, సలహాదారులు జగన్నథరాజు, ఉష, నీలిమ, శీరిష, రామకృష్ణంరాజు, డా.వర్మ, నిశాంతవర్మ, సీతారామరాజు, కేవీ సుబ్బరాజు, అంజన్‌రాజు, శివరామరాజు, సుబ్బరాజు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ భరత్‌కుమార్ తదితరులు క్షత్రియ సామాజికవర్గ నేతలు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన పలువురు క్షత్రియ నేతలను ఘనంగా సన్మానించారు.

సమాజానికి మానవత విశేష సేవలు

రాయచోటి టౌన్ : మానవత సేవా సంస్థ సమాజానికి విశేష సేవలు అందిస్తోందని ప్రజా చైతన్య సేవా సంస్థ వ్యవస్థాపకులు గడికోట చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాలలో మానవత సంస్థ అధ్యక్షులు అంకెం జయ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నెలవారి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవలను మరింత విస్తృతం చేసేందుకు సభ్యులు సహకరించాలన్నారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగ హేమంత్ రెడ్డి, రమ్యశ్రీలు పాల్గొని సంస్థకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం రాయచోటి శాఖ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులలో నైతిక విలువలను నేర్పించడంతో పాటు వారిలో సమాజంపై బాధ్యత పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అనంతరం మానవత సేవా సంస్థకు ఆర్థికంగా సహకరించిన సభ్యులను సన్మానించారు.



సేవా కార్యక్రమాలకు సహకరించిన సభ్యులను సన్మానిస్తున్న మానవత కమిటీ

కొనుగోళ్లు లేక ఢీలా



కొనేవారులేక పెనగలూరులో వెలవెలబోతున్న టపాసుల దుకాణాలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో టపాసుల దుకాణాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో టపాసులు కొనుగోలు చేయుటకు పెద్దగా మొగ్గు చూపడం లేదు. వర్షాలు తగ్గితే సోమవారం దీపావళి పండగ సందర్భంగా టపాసులు కొనుగోలు చేయుటకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తే వ్యాపారం పుంజుకుంటుందని యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను ఉపయోగపడేలా చేయాలి

లక్కిరెడ్డిపల్లి : టౌన్ సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కార్యకర్తలతో కలిసి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1987లో ప్రారంభించిన ఆర్టీసీ బస్టాండ్ 1992లో పూర్తయినా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా లక్కిరెడ్డిపల్లి పాత నియోజకవర్గ కేంద్రమైనప్పటికీ ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటికీ మండలంలోని చుట్టుపక్కల ప్రజలు రోజుకు దాదాపు మూడు, నాలుగు వందల మంది వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వస్తుంటారని, కానీ ఇక్కడ మాత్రం కనీస సౌకర్యాలైన పబ్లిక్ టాయిలెట్స్ మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవడానికి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు స్పందించి ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓబులేశు, శ్రీనివాసులు, నరసింహులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ కార్యకర్తలు

నల్లగంగమ్మకు పూజలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించి పూజలు చేయించిన భక్తులు ఆలయం ముందు భాగంలో భీజాక్షరాలతో ఉన్న మహిమగల రాయిని మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.



నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు


ఔదార్యం చాటుకున్న గజేంద్రారెడ్డి



దళితవాడలో ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేయిస్తున్న గజేంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ యువనాయకుడు దిన్నెపాటి గజేంద్రారెడ్డి ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని దిన్నెపాడు గ్రామంమాలపల్లిలో గత మూడు రోజులుగా బోరు కాలిపోయి తాగునీరు రాకపోవడంతో దళితులు ఇబ్బందికి గురవుతున్నారు. విషయాన్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో మాలపల్లిలోని గ్రామస్తులు స్థానిక గజేంద్రారెడ్డికి తెలియజేయగా ఆయన తక్షణమే స్పందించారు. సొంత నిధులతో తాగునీరు ట్యాంకర్ పంపించిన యువ నాయకులు దిన్నెపాటి గజేంద్రారెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గ్రామస్తులకు ఎల్లవేళలా తోడుగా ఉంటానని భరోసా కల్పించారు. బెస్తపల్లి, దళితవాడ, మాలపల్లిలకు త్వరలో వీధిలైట్లు అందిస్తామని దళితులకు రాత్రిపూట ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దళితవాడ మహిళలు, ప్రజలు గజేంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాయచోటిలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీన జరిగే ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పడాల రమణలు పాల్గొంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ బోర్డులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత నిధులు కోటి రూపాయలు జమ చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని నిలకొట్టుకోవాలని వారు కోరారు.